

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ఈ నెల7న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అర్జీ దారుల వినతులను స్వీకరిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పిజిఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్ట నున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు, మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను, 4 మునిసిపల్ ప్రధాన కార్యాలయాలలోనూ, 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తార న్నారు.అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతు లు సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

చొప్పెల్ల లాకులు.. చెప్పలేని సమస్యలు..

- సిబ్బంది కొరత వసతుల లేమి
- విడుదల కాని నిర్వహణ ఖర్చులు
- శిథిలమవుతున్న షట్టర్లు, గేట్లు, నివాసాలు,
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల లాకులు సమస్యలకు నిలయంగా మారాయి. 1850లో ఈ లాకును నిర్మించారు. ఆ తర్వాత వందేళ్లకు అంటే 1949లో మరోసారి స్లాబ్ ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తర్వాత నుంచి ఈ లాకు అభివృద్ధికి యంత్రాంగం నామ మాత్రపు చర్యలతో దీనస్థితికి చేరుకుంది. ధవలేశ్వరం బ్యారేజ్ నుంచి విడుదలయ్యే నీరు వేమగిరి వద్ద రెండు ప్రధాన కాలువలుగా విడిపోయింది. అందులో ఒకటి సామర్లకోట వైపుకు మరొకటి కోటపల్లి వైపుకు వెళుతున్నాయి. అప్పట్లో ఈ కోటిపల్లి కెనాల్‌కు చొప్పెల్ల వద్ద హెడ్ లాకుగా నిర్మించారు. ఈ లాకు దిగువున ఆలమూరు, కపిలేశ్వరపురం, కూళ్ల, మసకపల్లి, ఎర్రపోతవరం(మంజీరా), కెఎమ్‌జి ట్రైలాండ్ వద్ద సబ్ లాకులను నిర్మించారు. ఈ హెడ్ లాకు పరిస్థితే ఇలాగుంటే కింద లాకుల పనితీరు మరింత దయనీయంగా మారాయి. ఈ లాకుల అభివృద్ధి మాట ఎలా ఉన్నా కనీసం నిర్వహణా ఖర్చులు కూడా చాలా ఏళ్ల నుండి ప్రభుత్వం మంజూరు చేయడం లేదని అక్కడ పనిచేసే ఉద్యోగులు వాపోతున్నారు. ఈ క్రమంలో చాలా లాకులు శిథిలావస్థ స్థితిలోనే నడుస్తున్నాయని అక్కడ సిబ్బంది అంటున్నారు. లక్షలాది ఎకరాల భూములను సస్యశ్యామలం చేసే ఈ నీటిపారుదల వ్యవస్థకు సంబంధించిన లాకులను పటిష్ట పరచాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఇటీవల పలుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు. అందుకు సంబంధించిన అంచనాలు కూడా యంత్రాంగం చేత తయారు చేయించారు. అయితే ప్రభుత్వం నుంచి ఎందుకో చర్యలు ఉండటం లేదని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ లాకులు వద్ద నీటి నిల్వలను పెంచి తగ్గించడానికి కీలకంగా ఉండే షెట్టర్లకు గ్రీజు పెట్టే పరిస్థితి కూడా కానరావడం లేదు. ఈ ప్రభుత్వమే కాదు గత రెండు దశాబ్దాలుగా ఈ లాకులకు తగినంత ప్రాదాన్యత కల్పించడం లేదనే ప్రత్యేక వాదనలు వినిపిస్తున్నాయి.



లాకుల నుంచి విడుదలవుతున్న నీరు, (ఇన్‌సెట్)లో గేట్ల ద్వారా వృథాగా పోతున్న నీరు

చొప్పెల్ల లాకును రక్షించిన చెట్టు

శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ లాకులను చెట్టు రక్షించింది అంటే ఆశ్చర్యం కలగక మానదు. కానీ జరిగింది అదే. ఎలాగంటే 1986 వరదలకు గండి పడడంతో ఈ కాలువలోకి వరద నీరు పోటెత్తింది. పెద్ద ఎత్తున నీరు రావడంతో గేట్లు అన్నీ ఎత్తివేసినా ఈ లాకులు భరించే పరిస్థితి లేదు. అధిక నీటి ప్రవాహానికి ఈ లాకు పూర్తిగా ధ్వంసం అవుతుందని రైతులు, ప్రజలు ఆందోళన చెందారు. కాని అదే సమయంలో పురాతన చెట్టు ఈ లాకు ముందు అడ్డుగా పడిపోయింది. దీంతో నీటి తాకిడి లాకులకు లేకపోవడంతో సురక్షితంగా నిలబడి ఇప్పటికీ శిథిలమవుతూనే సేవలు అందిస్తుంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులను కోరుతున్నారు.

చొప్పెల్ల లాకులకు మరమ్మతులు చేపడతాం

చెప్పెల లాకుల తలుపులు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. పరిస్థితిని ఉన్నత అధికారులకు తెలియపరచి రూ. 9 లక్షలు ఆపరేషన్ అండ్ మెయిన్టనెన్స్ నిమిత్తం ఎస్టిమేషన్ వేసి ప్రతులను అనుమతుల కోసం పంపించాం. వచ్చిన వెంటనే లాకులకు మరమ్మతు పనులు చేపడతాం. ప్రధాన కాలువ పరిస్థితిని పరిశీలించి ఉన్నతి అధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. **–కె.సుబ్బారావు, ఇరిగేషన్ ఎఇ**

ఈ లాకు ద్వారా 1,04,934 ఎకరాల సాగు

చొప్పెల్ల హెడ్ లాకు ద్వారా మెదటి పంటకు 1,04,934 ఎకరాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. రెండో పంటకు 94,500 ఎకరాలకు నీటి సరఫరా అందిస్తున్నారు. మొదటి పంటకు రోజుకు వెయ్యి నుంచి 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. రెండవ పంటకు పదహారు వందల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఒక క్యూసెక్కు నీటిని 70 ఎకరాలకు సరిపోయే విధంగా అప్పట్లో ఈ నీటిపారుదల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ లాకులు చాలా వరకు శిథిలావస్థలకు చేరుకున్నాయి. గేట్లు పూర్తిగా మరమ్మతులకు వచ్చాయి. పడవల ప్రయాణానికి వీలుగా నిర్మించిన చాంబర్ గేట్లు పూర్తిగా చిల్లులు పడి నీరు కిందకుపోతోంది. దీంతో ఇక్కడ నీటి సరఫరా అంచనాల లెక్కలు పూర్తిగా తప్పుతున్నాయి. ఏ సమయంలో.. ఏ కాలువకు ఎంతంత నీరు విడుదల చేయాలనే స్పష్టమైన లెక్కల విధానం ఉంటుంది. కానీ ఈ పడవ చాంబర్ ద్వారా లెక్కకట్ట లేనంత నీరు వధాగా వెళ్లిపోతుంది. దీంతో కొన్ని ప్రాంతాల రైతులకు సక్రమంగా నీరు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇక లాకులు వద్ద పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది సంఖ్యను గణనీయంగా తగ్గించేశారు. తప్పని పరిస్థితుల్లో లాకు సూపర్డెంటెంట్ పోస్ట్ తప్ప మిగిలినవి అంతంత మాత్రమే. గతంలో పనిచేసే వారందరికీ అక్కడే నివాసం ఉండేందుకు క్వార్టర్స్, మరుగుదొడ్లు వంటి వసతులతో ఉండేవి. ఇప్పుడు అవన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ లాకులను అభివృద్ధి పరచాలని రైతులు వేడుకొంటున్నారు.



చొప్పెల్ల లాకుల వద్ద శిథిలావస్థలో ఉన్న నివాసాలు

కొబ్బరి కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలి

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు మండలంలో కొబ్బరి కార్మికులందరూ సమ్మె లో పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. సమ్మెకు ప్రాముఖ్యతను ఆదివారం వివరిస్తూ కొబ్బరి కార్మికుల సమస్యలపై వేసిన కరపత్రాన్ని ఆయన వారికి పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న దేశభక్తి సమ్మెలో కొబ్బరి ఒలుపు, దింపు కార్మికుల పాల్గొనాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో రెండు లక్షల 50 వేల ఎకరాల్లో కొబ్బరి పంట సాగులో ఉందన్నారు. ఇందులో 1,25,000 ఎకరాలు ఒక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉందన్నారు. ప్రతి ఏటా జిల్లాలో సుమారుగా 23 కోట్లు 52 లక్షల కొబ్బరికాయలు దిగుమతి వస్తుందన్నారు..ఈ మొత్తం పంట మార్కెట్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న కొబ్బరి కార్మికులే దీని ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం వస్తుందన్నారు. కొబ్బరి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అనేకసార్లు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకి విన్నవించుకున్న కార్మికుల పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొబ్బరి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొబ్బరి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి, యాజమాన్యాల వద్ద నుండి 1 శాతం చెస్ వసూలు చేయాలి, కనీస వేతనం రూ.26 వేలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, 50 సంవత్సరాలకు వృద్ధాప్య పెన్షన్ అమలు చేయాలన్నారు. ఈ శ్రమ నమోదు చేయించుకున్న కార్మికులందరికీ ప్రమాద బీమా రూ.ఐదు లక్ష లు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నమోదు చేయించుకున్న కార్మికులు రోడ్డు యాక్సిడెంట్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు గత ఇన్సూరెన్స్ అమౌంట్ మూడు సంవత్సరాలు బకాయిలు తక్షణమే చెల్లించాలి. డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు పాల్గొన్నారు.



కొబ్బరి కార్మికులకు కరపత్రాలు అందజేస్తున్న దుర్గాప్రసాద్

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ రైతు వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ జులై 9న జరిగే సమ్మెలో పాల్గొనాలని కంద తవ్వి, లోడింగ్ కార్మికుల యూనియన్ పిలుపునిచ్చింది. మండలంలోని ర్యాలి గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ మనదేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక,ఉద్యోగ,రైతు వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని, వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు, చట్టాలు వర్తించని కార్మికులు అందరూ బానిసత్వంలోకి నెట్టబడతారని అన్నారు. జాతీయ జీప్రయోజనాలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం విద్యుత్తు, రవాణా, బ్యాంకులు, ఇన్సూరెన్స్, స్టీలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తుందని అన్నారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగు, కాశీ,అంకాలు, తాతారావు, ఎసమ్మ, శీలం నాగేశ్వ రావు, శివ, వై.శ్రీను, యు.రాంబాబు, ఎం.శ్రీను, బి.రాంబాబు, త్రిమూర్తులు, డి.ప్రకాష్, వెంకన్న, సిం హాద్రి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్మికులు

కూలిన మురుగు కాలువ వంతెన

రెండు మండలాల్లోని వందలాది ఎకరాల సాగుపై ప్రభావం

ప్రజాశక్తి - ఆలమూరు

పినపళ్ల నుంచి గొల్లపుంత మీదుగా మండపేట వెళ్లేందుకు మూడున్నర దశాబ్దాల క్రిందట 1990–92 మధ్య కాలంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ హయాంలో పశుసంవర్ధకశాఖ మంత్రిగా పనిచేసిన సంగిత వెంకటరెడ్డి(చినకాపు) సహకారంతో నిర్మించిన వంతెన హఠాత్తుగా కూలి పోయింది. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రెండు మండలాల రైతులకు మరింత సహకారం అందించాలన్న ఉద్దేశ్యంతో ఈవంతెన రూపుదిద్దుకుంది. దీంతో మురుగుకాలువకు ఇరువైపులా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు వంతెన కూలిపోవడం ఇబ్బందికరంగా మారింది. మండపేట, వల్లూరు ఆయుకట్టు భూమికి సంబంధించి మురుగు కాలువ వెంబడి సుమారు 800 ఎకరాల్లో ప్రతియేటా పినపళ్ల రైతులు వరిసాగు చేస్తారు. దీంతో నారుమడులు పూర్తి చేసి వరినాట్లు వేసేందుకు సన్నద్ధమైన తరుణంలో వంతెన హఠాత్తుగా కూలిపోవడంతో రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే మురుగు కాలువ సమీపంలో నిర్మించిన శ్రీకృష్ణ ప్రభాస్ పేపరుమిల్లుకు చెందిన వ్యర్థపునీరు బయటకు వెళ్లేందుకు కూడా అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగాను స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయి. రైతుల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసి, వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని, జీవనోపాధిని కోల్పోతున్నామనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. స్థానిక పంటకు అవస రమైన ఎరువులు, పురుగు మందులను తరలిం చడంతో పాటు వ్యవసాయ పనులు చేపట్టేందుకు మండపేట నుంచి వయా గొల్లపుంత మీదుగా పినపళ్ల సరిహద్దులో ఉన్న ఆయుకట్టు భూమికి రావలసి ఉంది. దీనివల్ల వ్యయ ప్రయాసలకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపిటిసి సభ్యుడు పెదిరెడ్డి పట్టాభి, ఎఎంసి మాజీ ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు సంఘటనా స్థలానికి విచ్చేసి పరిస్థితిని సమీక్షించి సమస్యను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించారు.



పినపళ్ల గొడ్డు కాలువపై కూలిపోయిన వంతెన

ముందస్తుగా ప్రతిపాదనలు అధికారులు నివేదించాం

పినపళ్ల గొడ్డు కాలువపై ఉన్న వంతెన కూలి పోవడంతో పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సంగిత సుభాష్ తెలిపారు. ఈవంతెన శిథిలావస్థకు చేరిందని భావించి ముందస్తు జాగ్రత్త చర్యగా మూడేళ్ల క్రితమే డ్రెయిన్స్ శాఖ అధికారులు డిఇ పోచారావు, ఎఇ సుబ్రమణ్యం ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేది ంచామన్నారు. వంతెన కూలిపోవడం వల్ల రైతుల కు కలిగే నష్టాన్ని, ఇబ్బందులను సత్వరమే నియో జకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతా ధికారుల దృష్టికి మరోసారి తీసుకు వెళతానని సర్పంచ్ సుభాష్ రైతులకు హామీ ఇచ్చారు.



పరిశీలిస్తున్న సర్పంచ్ సుభాష్ తదితరులు

ఎపిఒ లక్ష్మీనారాయణకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం ఎపిఒ సిహెచ్.లక్ష్మీనారాయణ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. ముమ్మిడివరం డ్వామా కార్యాలయంలో జిల్లా పీడీ మధుసూదన్, అమలాపురం, రామచంద్రపురం ఏపీడీలు డి.రాంబాబు, సత్యనారాయణ చేతులు మీదుగా ఆయనకు ఈ పురస్కా రాన్ని అందజేశారు. గత ఏప్రిల్ నెలలో ఉపాధి హామీ కూలీలకు ఎక్కువగా పని దినాలు కల్పించి నందుకు ఈ అవార్డు అందించారన్నారు. ఎపిఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింతగా బాధ్యతలు పెరిగాయని, ఉపాధి కూలీలకు ఎక్కువగా పని దినాల పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.



జిల్లా స్థాయి ప్రతిభా పురస్కారం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

సంక్షేమం, అభివృద్ధికే ప్రభుత్వ ప్రాధాన్యత

ప్రజాశక్తి - సఖినేటిపల్లి


ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధేకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. ఆదివారం సఖినేటిపల్లి మండలం మోరి, కేశవదాసు పాలెం గ్రామాలలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలతో కలసి అయన రాజశేఖర్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వ సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గతంలో మునిపెన్నడూ లేని విధంగా సంక్షేమం అభివృద్ధి ఏకకాలంలో జరిగేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. ప్రభుత్వం పెన్షన్ విధానాన్ని అద్భుతంగా అమలు చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది బిడ్డలు చదువుకుంటే అంత మంది బిడ్డలకు తల్లులు ఖాతాలో పథకం సొమ్ములు జమ చేశారన్నారు. రాష్ట్రంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైనటువంటి రోడ్లను సంవత్సరకాలంలో నిర్మించారని, మిగిలిన రోడ్లను త్వరలో పూర్తి చేస్తామన్నారు. గ్రామ గ్రామాన సిమెంట్ రోడ్లను నిర్మించుకుంటున్నామని, ప్రతి నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి లేకుండా పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తున్నామని రాజశేఖర్ తెలియజేశారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, చాగంటి స్వామి, ఏనుముల శ్రీధర్, ఎనుముల సత్యనారాయణ, ఎనుముల సింహాచలం, యెనుముల రమణ, బెల్లంకొండ సత్యనారాయణ, అడబాల విజయ్, చెల్లుబోయిన చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌సి రాజశేఖర్

వైసిపి అయినవిల్లి మండల అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - అయినవిల్లి



మేడిశెట్టి శ్రీనివాస్

వైసిపి అయి నవిల్లి మండల అధ్యక్షు నిగా కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయ కులు మేడిశెట్టి శ్రీనివాస్ నియమితులయ్యారు ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా నియోజకవర్గ నాయకులు నాపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షునిగా నియమించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు అందర్నీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పలువురు వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు



శ్రీనును సత్కరిస్తున్న నాయకులు

వైసిపి జిల్లా కార్యదర్శి శ్రీనుకు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వైసిపి జిల్లా కార్యదర్శిగా ఎస్.యానంకు చెందిన సీనియర్ వైసిపి నాయకుడు పొగాకు శ్రీను నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆదివారం శ్రీనును ఆయన ఇంటి వద్ద పలువురు నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు.శ్రీను కు జెడ్పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, పేరూరు సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్, నాయకులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు .పదవి ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. అభినందించిన వారిలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు లంకే శ్రీను, నాయకులు మోటూరి సత్యం కాపు,రేవు రాజేష్, తాడి గోపాలకృష్ణ, ముత్తాబత్తుల సురేష్,లంకే చిరంజీవి తదితరులు ఉన్నారు.

ఘనంగా గరగ ఉత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న ధనలక్ష్మి అమ్మవారి గరగ ఉత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా గ్రామంలో ఐదు రోజులపాటు ప్రతి ఇంటికి కూడా గరగ రూపంలో అమ్మవారు వెళ్లడం ఆచారంగా వస్తుందన్నారు. ఈ నెల 10న గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. 11న తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు


ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానములో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు పలువురు దాతలు విరాళాలు అందజేశారు. మల్కిపురం మండలం లక్కవరానికి చెందిన పల్లపోతు నాగేశ్వరావు, వారి కుటుంబ సభ్యులు ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారు. వీరు స్వామి వారి అన్న ప్రసాద ట్రస్ట్ కు రూ. 25,000 విరాళంగా సమర్పించారు. అదేవిధంగా తణుకుకు చెందిన ఉల్లపు దినకర్ వెంకట శ్రీహర్ష, వారి కుటుంబ సభ్యులు రూ 10,116 విరాళంగా అన్నదాన ట్రస్ట్‌కు సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేశారు.



స్వామి వారి చిత్రపటం అందుకుంటున్న దాతలు

కార్టూ'నిజం'





రైతులకు డ్రోన్‌లను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

సాగులో యాంత్రీకరణ పద్ధతులను వినియోగించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతులు సాగులో యాంత్రీకరణ పద్ధతులను వినియోగించడం ద్వారా అధిక ఉత్పత్తులను సాధించవచ్చునని ముమ్మిడివరం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. కొత్తలంక, చిన కొత్తలంక పంచాయతీ పరిధిలో ఆదివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతు సంఘాలకు మంజూరైన కిసాన్ డ్రోన్‌ను రైతులకు ఆయన అందజేశారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాస్, చిక్కాల అంజి బాబు, తోలేటి రాంబాబు, గిసాల దుర్గ, దంగేటి శ్రీను తదితరులుపాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పౌర హక్కులను పరిరక్షించే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని రాజ్యాంగ పరిరక్షణ సమితి పేర్కొంది. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలోని పెద పేట, నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం పెట్టా వారి పేట తదితర గ్రామాల్లో ఆదివారం 'గడప గడపకి భారత రాజ్యాంగం'పై అవగాహనా సదస్సులు జరిగాయి.ఈ సందర్భంగా నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెనుమాల సుధీర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలలోని మనువాద, మతోన్మాద ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. వీటిని తిప్పి కొట్టే విధంగా పేదలను , మైనార్టీలు, మహిళలు సంఘటితమై రాజ్యాంగ పరిరక్షణకు చైతన్యవంతమైన పాత్రను పోషించాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ చదువుకున్న యువతి, యువకులు ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగం పౌరులకు స్వేచ్ఛ , సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులను కల్పించిందని గుర్తు ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో నేరేడుమిల్లి అబ్బులు, కెవివి.సత్యనారాయణ(డ్రాయింగ్ ఉపాధ్యాయడు), కవి, తాటిపాక దుర్గ బాబు, మట్టా శ్రీనివాస్, వాకపల్లి వెంకట రత్నం, యలమంచిలి బాలరాజు, వి ప్రసాద్,శరత్, ఆయా గ్రామాల యువత, మహిళలు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో గడపగడపకూ భారత రాజ్యాంగం కార్యక్రమంలో స్థానికులు

నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచని రోడ్డు


సిసి రోడ్డు నిర్మాణానికి శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ (ఫైల్)

ప్రజాశక్తి - ఆత్రేయపురం
రాష్ట్ర ప్రభుత్వం పల్లె బాట కార్యక్రమం పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గ్రామపంచాయతీలలో గ్రామసభల ద్వారా గుర్తించి. అత్యవసరమైన రోడ్లకు అభివృద్ధి చేసేందుకు గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నిధులు కూడా మంజూరు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో వచ్చేసరికి అభివృద్ధి

ఎంతో ఆర్భాటంగా శిలాఫలకం ఆవిష్కరణ

జరగలేదు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రం ఆత్రేయపురంలో గ్రామసభల ద్వారా సమస్యలను గుర్తించి సంవత్సరాల తరబడి కొద్దిపాటి వర్షానికి ముంపు గురవుతున్న రోడ్లను జాతీయ గ్రామీణ

> **సి సి రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం**
>
> పల్లెబాట కార్యక్రమ ద్వారా గుర్తించిన పనులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నిధులు మంజూరయ్యాయి దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. పంచాయతీ లో తీర్మానం చేసి గుత్తేదారుకు పనులు అప్పజెప్పి పెదపేటలోని సిసి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
>
> -బికెఎస్ఎస్.వెంకట్ రామన్, ఎంపిడిఒ

ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.23 లక్షలు మం జూరు చేశారు. ఆత్రేయపురం శివారు కుమ్మరి పేటలో వీరభద్ర స్వామి గుడి వద్ద నుండి కమ్యూనిటీ హాల్ వరకు రూ.18 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, డ్రెయినేజీ చేపట్టారు. అలాగే పెదపేట దళితవాడలో కాకి రామకృష్ణ ఇంటి నుంచి గెడ్డం యేసమ్మ ఇంటి వరకు 200 మీటర్ల పొడవు సిసి రోడ్డు నిర్మించేందుకు రూ.5 లక్షలు మంజూరు చేసి గ్రామంలోని టిడిపి నాయకుడుకు నామినేటెడ్ వర్క్ చేసేందుకు గ్రామపంచాయతీలో తీర్మానించారు. అయితే కుమ్మరిగూడెంలో రోడ్డును నిర్మించారు కానీ. పెద్ద పేట దళితవాడలో నేటికీ రోడ్డులు నిర్మించలేదు. ఈ పనులు చేసేందుకు ఎంతో ఆర్భాటంగా స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. కొద్దిపాటి వర్షానికే ఈ రోడ్డు ముంపునకు గురవుతోంది రోడ్డు నిర్మించాలంటూ ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు, నాయకులకు విన్నవించుకున్న వారు పట్టించుకున్న దాఖలాలు లేవని దళితవాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు పనులు చేయాలని ఆదేశాలు జారీ చేసినా గ్రామ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు.


అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్న దళితపేటలో రోడ్డు

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న పదిమంది అరెస్టు

ప్రజాశక్తి - తాళ్లపూడి
తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని గజ్జరం గ్రామంలో పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేయడం జరిగిందని తాళ్లపూడి ఎస్సై టి రామకష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12,340 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది కూడా ఉన్నారు.

గొల్లప్రోలులో...
పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.22,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు
మండలంలోని కోలంక నామావారి వీధిలో విద్యుదాఘాతంతో ఒక తాటాకు ఇల్లు దగ్ధం అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కోలంక నామవారి వీధిలో నివాసం ఉంటున్న కొడగాల వెంకటేశ్వర్లుకు చెందిన తాటాకు ఇంటికి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.దీంతో స్థానికులు కాకినాడ అగ్నిమాపక శాఖకు ఫోన్ ద్వారా తెలియచేశారు. అగ్నిమాపక శకటం వచ్చే సమయానికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఫైర్ సిబ్బంది చుట్టుపక్కలకు మంటలు వ్యాప్తి చెందకుండా కట్టడి చేశారు. ఈ తాటాకు ఇంటిలో వెంకటేశ్వర్లు, చిన్న కుమారుడు వీరబాబు నివాసం ఉంటున్నారు. ఇంటిలో గల సామాగ్రి పూర్తిగా తగలబడడంతో ఆ కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో నష్టం రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసినట్లు జిల్లా సహాయ ఫైర్ అధికారి బి.ఏసుబాబు తెలిపారు.

పశు మాంసం తరలిస్తున్న వారిపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు
మండలంలోని చెందుర్తి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న పశు మాంసాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుర్తి గ్రామ శివారులో గోవధ జరుగుతుందన్న సమాచారంతో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, విఆర్ఒ ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక ట్రక్ లో సుమారు 1000 కేజీల పసుమాంసంను స్వాధీనం చేసుకున్నారు. ఒక ట్రక్ ఆటో, నాలుగు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి - గొల్లప్రోలు
శుక్రవారం పట్టణంలో బైపాస్‌లోని దాబా వద్ద జరిగిన హత్యాయత్నం కేసు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణానికి చెందిన జ్యోతుల రాంబాబు, ఊట దుర్గాప్రసాద్‌లను శని వారం రాత్రి స్థానిక టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ రామకృష్ణ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట
స్థానిక సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు పనుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, ఉప్పువారి వీధి, పాత రెవెన్యూ కార్యాలయం, బలుసులపేట, సంగీతరావుపేట, వీరరాఘవపురం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు
మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 8న స్థానిక లయన్స్ క్లబ్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని వైసిపి శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

మృతుని కుటుంబానికి డిటిఒ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి
మృతుని కుటుంబానికి జిల్లా రవాణా శాఖ అధికారి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇవి.. అంతర్వేది పల్లిపాలెంకి చెందిన కామాని దుర్గాప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మరణించచదంతో, కుమారుడికి తల్లి తలకొరివి పెట్టిన


మృతుని తల్లిని ఓదాస్తున్న డిటిఒ

సంఘటన వార్త పత్రికల్లో చూసానని ఈ సంఘటమ తనను ఎంతో కలచివేసిందని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లిపాలెం గ్రామంలో మృతుడు దుర్గాప్రసాద్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. మృతుని తల్లికి రూ.10 వేలసాయం అందించారు. వృద్ధాప్య పెన్షన్ డ్వాక్రా రుణానికి జమచేయాల్సి వస్తుందని దీనితో కుటుంబపోషణకు చాలా కష్టమౌతుందని మృతుని తల్లి జిల్లా రవణాశాఖ అధికారి శ్రీనివాసరావుకు తెలియజేసింది. దీంతో కుటుంబానికి ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపించే ఏర్పాటు చేస్తానని తెలిపారు. అదేవిధంగా అన్ని విధాలుగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పల్లిపాలెం గ్రామ ప్రెసిడెంట్‌కి డిటిఒ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఏ ఇబ్బంది ఉన్నా తనకు ఫోన్ ద్వారా తెలియచేయాలన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

- ఎస్ఐ, కానిస్టేబుల్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన 2009 ఎస్ఐల బ్యాచ్

ప్రజాశక్తి - ఆలమూరు
గత నెల జూన్ 26న కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ ఎం. అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ మృతి చెందారు. ఆదివారం మృతుల కుటుంబాలను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 2009 ఎస్ఐల బ్యాచ్‌కు చెందిన వారు పరామర్శించారు. తమ బ్యాచ్‌మేట్ ఆలమూరు ఎస్ఐగా పనిచేస్తూ మృతి చెందిన ఎం.అశోక్ స్వగ్రామమైన నర్సాపురం ఆయన నివాసానికి వీరంతా విచ్చేశారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. మృతుడు అశోక్‌కు భార్య, ఇద్దరు కుమారులు. ఒకరు బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి, మరొకరు 9వ తరగతి విద్యార్థి. మృతుడు ఎస్ఐ అశోక్ కుటుంబానికి 2009 ఎస్ఐల బ్యాచ్ తరపున ఏర్పాటైన వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.26 లక్షల చెక్కును అందించారు. కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ స్వగ్రామమైన ఆలమూరు ను కూడా వారు సందర్శించి, కానిస్టేబుల్ జీవన్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆయన కుటుంబానికి రూ.5 లక్షల సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమం చేయడానికి సహాయ సహకారాలు


నరసాపురంలో మృతుడు ఎస్ఐ అశోక్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న 2009 ఎస్ఐల బ్యాచ్

అందించిన రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ మాట్లాడుతూ వీరంతా 2009 ఎస్ఐల బ్యాచ్ అన్నారు. అలాగే వీరంతా కలిసి 2020లో వెల్ఫేర్ సొసైటీ స్థాపించుకున్నారన్నారు. అప్పటి నుంచి ఈ సొసైటీ ద్వారా వారి బ్యాచ్‌కి చెందిన అవసరంలో ఉన్న కుటుంబాలకు ఇప్పటివరకు రూ.2 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించారన్నారు.

మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


అమలాపురంలో జగజ్జీవన్‌రామ్ వర్ధంతిలో పాల్గొన్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - యంత్రాంగం
మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అమలాపురం: స్థానిక గడియార స్తంభం సెంటర్ నందు మాదిగల పొలిటికల్ జెఎసి, ఎంఇఎఫ్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ హాజరై


కొత్తపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నాయకుల నివాళి

జగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మడికి శ్రీరాములు, మడికి సత్యనారాయణ, నవుండ్రు లక్ష్మణరావు, యార్లగడ్డ రవీంద్ర, నవుండ్రు వాడపల్లి , లంక అర్జున్ రావు , ఉందుర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** జగ్జీవన్‌రామ్ వర్ధంతిని కొత్తపేటలో వర్ధంతి నిర్వహించారు. కముజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు,బూసి భాస్కరరావు. వాసంశెట్టి సత్యనారాయణ, వీళ్ల మారుతి, ముద్రగడ సుబ్బారావు, ధనరాజు. ఆనంద్.రాజబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మండపేట:** పట్టణంలో బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతిని నిర్వహించారు. విగ్రహాల కమిటీ కన్వీనర్, 8వ వార్డు వైసిపి కౌన్సిలర్ నియోజకవర్గ ఆర్‌టిఐ వింగ్ కన్వీనర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి పార్టీ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ జొన్నపల్లి సత్తిబాబు, యర్రగుంట అయ్యప్ప, యరమాటి వెంకన్నబాబు, యర్రవరపు సూరిబాబు, అంధనాపల్లి రవి, రమేష్, శీలి సత్యనారాయణ, చిన్ని విజయ్, దుగ్గిరాల చిన్న, తదితరులు, పాల్గొన్నారు. **అంబాజీపేట**: ప్రజాస్వామ్యంలో సామాజిక సమానత్వం సమగ్ర అభివృద్ధి సాధించాలంటే జగ్జీవన్‌రామ్


మండపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నాయకుల నివాళి

ఆశయాలను అనుసరించాలని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం అక్విడెక్టు, అంబాజీపేట సెంటర్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏకలవ్యుని జయంతి సందర్భంగా డొక్కా సీతమ్మ అక్విడెక్టు వద్ద చిత్రపటానికి, అంబాజీపేట బస్టాండ్ వద్ద ఏకలవ్యుడు విగ్రహానికి ఎంఎల్ఎ పూలమాలలు వేసి కేక్ కట్ చేసి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ, మండల అఖిలపక్ష నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో పాల్గొన్న ఎంఎల్ఎ గిడ్డి తదితరులు


కేక్ కట్ చేస్తున్న ఎంపీ హరీష్, ఎంఎల్ఎ వేగుళ్ల

ఘనంగా ఏకలవ్య జయంతి

ప్రజాశక్తి - మండపేట
పట్టణం 26వ వార్డు దుర్గమ్మ గుడి వద్ద ఏకలవ్య జయంతిని ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, 26వ వార్డు కౌన్సిలర్ అమలదాసు లక్ష్మి, కోనసీమ ఎరుకుల సంఘం జిల్లా సెక్రటరీ సమతం చిన్న పాపారావు, మండపేట మండల సంఘం అధ్యక్షులు అమలదాసు రుద్రమూర్తి, సెక్రటరీ సింగం రాంబాబు, అమలదాసు చిన్నబ్బులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా పోటీలు

ప్రజాశక్తి - అమలాపురం
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగాసనాలు పోటీలను ఆదివారం నిర్వహించారు. యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యోగాసనాలు జడ్జి కెఎస్‌వి.శ్రీధర్ సాంకేతిక సహకారంతో 10 నుంచి 80 సంవత్సరముల వరకు అన్ని వయసుల వారికి యోగాసనాలు పోటీల నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


ఆశీర్వచనం తీసుకుంటున్న అడిషనల్ కమిషనర్

భీమేశ్వరుని దర్శించుకున్న రాష్ట్ర అడిషనల్ కమిషనర్

ప్రజాశక్తి - రామచంద్రపురం
రాష్ట్ర లాండ్స్ అండ్ సర్వే అడిషనల్ కమిషనర్ గోవిందరావు కుటుంబ సమేతంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్రాక్షారామం భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం విచ్చేసిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇక్కడ గల భీమేశ్వర స్వామికి, మాణిక్యమ్మ అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంవేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్
రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని దండు పుంతలో దృష్టి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం షారోన్ ప్రేయర్ హాల్ పాస్టర్ జాషువా గిరి, షారోన్ నేతృత్వంలో జరిగింది. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ అభివృద్ధికి నగదు అందజేస్తున్న దాత గవర్రాజు, తదితరులు

నూకాంబిక ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు
మండలంలోని చింతలూరు శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాల నిమిత్తం మండల కేంద్రం ఆలమూరుకు చెందిన సత్యలక్ష్మి రైస్ మిల్స్ అధినేత వెత్సా గవర్రాజు అండ్ పార్టనర్స్ భారీ విరాళాన్ని అందించారు. ఆలయంలో రాజగోపురాల నిర్మాణంలో వినియోగించమని కోరుతూ రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో వెత్సా నెహ్రూ, వెత్సా సురేష్, వెత్సా రాము, వెత్సా గుప్తా, వెత్సా సూరిబాబు, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు, నేత గన్ని సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆషుర్ ఖానాలకు నిధుల కేటాయింపు

ప్రజాశక్తి - అమలాపురం
రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ మెంబర్ హాజీ ముక్రం హుస్సేన్ విన్నపం మేరకు ఆదివారం జిల్లా మొహర్రం సంతాప దినాల సందర్భంగా జిల్లాలో 60 ఆషుర్ ఖానాలకు రూ.5వేల చొప్పున ఎపి వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ రూ.3 లక్షల నిధులు కేటాయించారు. అమలాపురం నియోజకవర్గం అమలాపురం మండలం, అల్లవరం మండలాలలో ఉన్న షియా ముస్లిం ఆషుర్ ఖానా లకు రూ.5 వేల చొప్పున అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ వక్ఫ్ బోర్డు మెంబెర్ హాజీ ముఖరం హుస్సేన్, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ సోంబాబు, మహమ్మద్ బషీర్, హుస్సేన్ రాజా, లియాకత్, తదితరులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న ఎంఎల్ఏ ఆనందరావు


కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ ఎడి డాక్టర్ అనిత

జంతు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆలమూరు
జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత తెలియజేశారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహనా కార్యక్రమం తో పాటుగా పెంపుడు జంతువులకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలల్లో ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్స్ వేశారు. సోమవారం సైతం పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం కొనసాగనుందని అనిత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ భాను ప్రసాదరావు, డాక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


పాపారాయుడు పుట్టినరోజు వేడుక లో పాల్గొన్న వైసిపి నాయకులు, అభిమానులు

ఘనంగా పాపారాయుడు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - మండపేట
మండలం అర్తమూరు గ్రామంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రిపాపారాయుడు పుట్టినరోజు వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్తమూరు ఆయన స్వగృహంలో అభిమానులు నాయకులు మధ్య జరిగిన కార్యక్రమంలో పాపారాయుడు అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మండపేట ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ లో పేదలకు అన్నదానం చేశారు. తమ అభిమాన నాయకుడు ఆరోగ్యంతో చిరకాలం నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరారు. పాపారాయుడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి డైరెక్టర్ పలివెల సుధాకర్, జడ్‌పిటిసి సభ్యురాలు కుడుపూడి భవాని, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, పెంకే గంగాధరం, సూరంపూడి సత్యప్రసాద్, ఎంపిటిసి సభ్యులు అడ్డాల శ్రీదేవి, పంపన లక్ష్మీ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి
ద్విచక్ర వాహనాలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్లో ద్విచక్ర వాహనాలపై పోలీసులు హెల్మెట్ ధరించి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలకు గురైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రమాదం జరిగితే వారిపై ఆధారపడిన కుటుంబాలు జీవితకాలం నష్టపోతాయని, అందుకే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాలకు గురకాకుండా కాపాడుకోవాలని తెలిపారు.

గొల్లప్రోలులో నేడు వైసిపి సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు
స్థానిక సత్య కృష్ణ కల్యాణ మండపంలో సోమవారం పిఠాపురం నియోజకవర్గ వైసిపి సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.